క్లుప్తంగా

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి వితరణ



బంగారు ఆభరణం అందజేస్తున్న దంపతులు

గార్లదిన్నె: మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బళ్లారి జిల్లా కంప్లి గ్రామానికి చెందిన భక్తులు కడవకల్లు పురుషోత్తం, నాగవేణి దంపతులు రూ.1.83 లక్షలు విలువ చేసే 3.210 మిల్లి గ్రాముల బంగారు ఆభరణం వితరణ చేశారు. ఈ సందర్భంగా స్వామికి పూజలు నిర్వహించి దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారన్నారు. అనంతరం భక్తుల సౌకార్యర్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ప్రధాన అర్చకులు రామాచార్యులు, దామోదరాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఘనంగా దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో దత్తాత్రేయస్వామి

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో నిర్మించిన దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి ఆలయంలో అంకురార్పణ, దేవతా మంత్ర జపము, అగ్ని ప్రతిష్ట దీక్షా హోమం, మహా గణపతి హోమాలు, మంగళ హారతులను నిర్వహించారు. ఆదివారం వేకువ జామునే గణపతి పూజ, ప్రాతఃకాల పూజ, యంత్రస్థాపన, ప్రతిష్ట హోమం, ప్రాణ ప్రతిష్ట హోమాలు నిర్వహించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం అభిషేకం, కుంభాభిషేకం, బలిహారం, గోదర్శనం, మహా మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీడీఓకు పరామర్శ



ఎంపీడీఓను పరామర్శిస్తున్న ఎంపీపీ బోగాతి మురళీమోహన్‌రెడ్డి

పామిడి : పామిడి ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్‌ను వైఎస్సార్‌సీపీనాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ద్విచక్ర వాహన ప్రమాదంలో ఎంపీడీఓ కాలు విరిగింది. ఎంపీడీఓను ఎంపీపీ బోగాతి మురళీమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి తదితరులు పరామర్శించారు. పార్టీ నాయకులు వెంకట్రామిరెడ్డి, రమణారెడ్డి, రామశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, ఓబులేసు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నేడు ఘంటసాల నాటక ప్రదర్శన

గుంతకల్లు: స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఘంటసాల నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పద్మశ్రీ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు తెలిపారు. సినీ సంగీత ప్రియులు, ఘంటసాల అభిమానులు, కళాకారులు హాజరై ఈ ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇసుక తరలింపు ఆపండి



ఇసుక తరలించిన దృశ్యం

శింగనమల: మండలంలోని రాచేపల్లి రెవెన్యూ పరిధిలోని సలకంచెరువు వంక సమీపంలో కొందరు ట్రాక్టర్లతో రాత్రిల్లు వచ్చి తమ పొలాల్లో అక్రమంగా ఇసుక తరలించుకొని పోతున్నారని రైతు గంగిరెడ్డి తదితరులు వాపోయారు. పొలాల్లో రస్తాలు ఏర్పాటు చేసుకున్నారని, అడ్డుకుంటే రైతులపై దౌర్జన్యం చేసున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు విన్నవించినా.. ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోయారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి అర్బన్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో భగత్‌సింగ్ నగర్‌కు చెందిన శేఖర్‌నాయుడు, శ్రీనివాస పురానికి చెందిన చిన్న రామాంజినేయులను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు నిమిత్తం అర్బన్ పోలీసులకు అప్పగించినట్లు సెబ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆర్బీకే సేవలు భేష్

- అన్నదాతలకు అండగా నిలుస్తున్న వైనం
- లక్ష్యాన్ని చేరుకున్న సిబ్బందికి ప్రశంసాపత్రాలు



గొడ్డుమర్రిలో నూతనంగా ప్రారంభించిన ఆర్బీకే

యల్లనూరు: రైతుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలు సేవల్లో శభాష్ అనిపించుకుంటున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తూ.....తగిన సలహాలు సూచనలతో ముందడుగులు వేస్తున్నాయి. ప్రతి నెలా మూడు టాస్క్‌లు టార్గెట్ పెడుతూ ప్రతి టాస్క్‌లో ప్రగతి లక్ష్యాలను చేరుకున్న వీహెచ్‌ఏలకు కమిషనరేట్ నుంచి ప్రశంసాపత్రాలను అందిస్తున్నారు. ప్రగతి లక్ష్యాలను ఛేదించడంలో వీహెచ్‌ఏ సిబ్బంది పోటీపడుతున్నారు. జిల్లా స్థాయి అధికారులతో మన్ననలు పొందుతున్నారు. నేల తల్లిని నమ్ముకున్న అన్నదాతలకు అండగా ఉంటూ, పంటల సాగు నుంచి కోత సమయం వరకు సలహాలు, సూచనలు అందిస్తున్న వీహెచ్‌ఏలకు రైతులు సలాం కొడుతున్నారు.

యల్లనూరులో......

మండలంలో 14 సచివాలయాల్లో 14 మంది వీహెచ్‌ఏలు పని చేస్తున్నారు. 15 వేల పట్టాదారు పాసు పుస్తకాలు ఉండగా 15 వేలకు పైగా రైతులు, 140 మంది కౌలు రైతులు ఉన్నారు. సాగు విస్తీర్ణం 31 వేల ఎకరాలు. గతేడాది పంటల బీమా కింద రైతులకు రూ.10 కోట్లు అందింది. ప్రస్తుతం 9,800 మంది రైతులకు 12.19 కోట్లు పంటల బీమా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఏఓ రామకృష్ణుడు, వీహెచ్‌ఏలు ప్రతి రైతు పొలం వద్దకు క్షేత్రస్థాయిలో తిరిగి పంటల సాగు నమోదు చేశారు. దీంతో ప్రతి రైతుకు పంటల బీమా కింద డబ్బు ఖాతాలో జమయ్యాయి. వారి సేవలను గుర్తించి రాష్ట్ర అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు యల్లనూరుకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది.

ఆగస్టు నెలకు వీరే టాపర్లు

బుక్కాపురం సచివాలయంలో వీహెచ్‌ఏగా పనిచేస్తున్న రష్మిత, వెన్నపూసపల్లి వీహెచ్‌ఏ ఈరాదేవి, గొడ్డుమర్రి వీహెచ్‌ఏ చందన, దంతలపల్లి వీహెచ్‌ఏ హుస్సేన్‌లకు కమిషనర్ నుంచి ఎక్సలెంట్ ఫర్ఫామెన్స్ సర్టిఫికెట్ లభించింది. ప్రతి రైతుకు ఈక్రాప్ బుకింగ్, ఇన్సూరెన్స్ వంటి వివరాలను యాప్‌లో నమోదు చేసి లక్ష్యాలను ఛేదించడంతో సర్టిఫికెట్ ఇచ్చారు.

కష్టపడినందుకు గుర్తింపు



నా ఆర్బీకేలో 560 మంది రైతులకు సేవలు అందిస్తున్నా. మాకు ఈక్రాప్ బుకింగ్, పీఎం కిసాన్ ఈకేవైసీ, ఆర్బీకే చానల్, సీహెచ్‌సీ, అగ్రి మ్యాగజైన్ తదితర టార్గెట్‌లు నెలనెలా ఉంటాయి. ప్రతి టాస్క్‌కు ప్రగతి లక్ష్యాలను చేరుకుంటేనే ప్రశంసాపత్రానికి అర్హులం. కష్టపడి పొలాల్లో తిరిగి నమోదు చేసినందుకు నాకు ఈ ప్రశంశాపత్రం దక్కింది. నా తోటి మిత్రులకు ముగ్గురి వీహెచ్‌ఏలు ప్రశాంసాపత్రాలను అందుకున్నారు. నా శ్రమకు గుర్తింపు దక్కడంతో సంతోషంగా ఉంది. సెప్టెంబరులో తప్పకుండా మళ్లీ ప్రశంసాపత్రం తీసుకునేందుకు కృషి చేస్తా.

– రష్మిత, వీహెచ్‌ఏ, బుక్కాపురం

రైతులకు చేయూత



ప్రతి రైతు తోట వద్దకు వెళ్లి ఈ క్రాప్ బుకింగ్, పంటల బీమా నమోదు చేస్తున్నాం. ప్రభుత్వ పథకాలను రైతులకు అందిస్తూ వారి చేయూతనిస్తున్నాం. 14 మంది వీహెచ్‌ఏలు నిరంతరం వ్యవసాయ పొలాల్లో ఉంటూ ప్రతి రైతుకూ న్యాయం చేస్తున్నారు. మా సిబ్బంది సేవలను గుర్తించి ఉన్నతాధికారులు ప్రశంశాపత్రాలను అందించారు. చాలా సంతోషంగా ఉంది.

– రామకృష్ణుడు,ఏఓ , యల్లనూరు

గూగూడు సన్నిధిలో ఎంపీ




గూగూడు కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ తలారి రంగయ్య

నార్పల: మత సామరస్యాలకు ప్రతీక నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామిని ఆదివారం ఎంపీ తలారి రంగయ్య దర్శించుకున్నారు. ఆయన గ్రామానికి చేరుకోగానే అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకొని చక్కెర చదివించారు. ఆయన మాట్లాడుతూ మహిమ గల కుళ్లాయిస్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: మండల కేంద్రంలోని ఆస్పత్రి కాలనీలో ఆదివారం ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి జూద కేంద్రంపై తన సిబ్బందితో దాడి చేశారు. ఇందులో భాగంగానే మండల కేంద్రానికి చెందిన రంగనాయకులు, రాజశేఖర్, రామాంజనేయులు, సుభాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12,360 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీ శ్రీనివాసులురెడ్డి, చాంద్‌బాషా. భూపతిరాజు, శివ పాల్గొన్నారు.

అనారోగ్యంతోనే ఆంజనేయులు మృతి



ఆంజనేయులు బ్రాట్ డెడ్ అయినట్లు పామిడి డాక్టర్ నిర్ధారణ చేసిన దృశ్యం

మృతుడు ఆంజనేయులు (ఫైల్)

గుత్తి: మండలంలోని ధర్మాపురానికి చెందిన టీడీపీ నాయకుడు, నాల్గో వార్డు సభ్యుడు ఆంజనేయులు (60) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే చంద్రబాబు నాయుడు అరెస్టును జీర్ణించుకోలేక టీవీ చూస్తూ ఆంజనేయులు మృతిచెందాడని ఎల్లో మీడియాలో వార్తలు ప్రచురితం కావడం, ప్రసారం కావడం చేశారు. అయితే వాస్తవాలు మరోలా ఉన్నాయి. ఆంజనేయులు అనారోగ్యంతో నాలుగైదు రోజులుగా గుత్తి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఆధారాలు ఉన్నాయి. శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో వడ్డే ఆంజనేయులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి వచ్చాడు. బీపీ 170 ఉందని, వెంటనే అనంతపురం తీసుకెళ్లాని సూచించారు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు అనంతపురం తరలిస్తుండగా పామిడి వద్ద పరిస్థితి విషమించింది. దీంతో పామిడి ఆస్పత్రికి తరలించారు. ఆంజనేయులును డాక్టర్ యల్లప్ప పరీక్షించారు. మార్గంమధ్యలోనే (బ్రాట్ డెడ్) మృతి చెందినట్లు నిర్ధారించారు. వాస్తవాలు ఇలా ఉండగా ఎల్లో మీడియా, టీడీపీ కార్యకర్తలు చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ఆంజనేయులు గుండెపోటుతో మృతి చెందినట్లు వార్తలు రాయడం, మాధ్యమాల్లో ప్రసారం చేయడం చేశారు.

ఘనంగా ఏకాదశి కార్యక్రమం



అలంకరణలో పాండురంగడు



ప్రాకారోత్సవ దినోత్సవం చేస్తున్న భక్తులు

పామిడి: పట్టణ చిన్న విఠోబ ఆలయంలో ఆదివారం ఏకాదశి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విఠోబస్వామిని శోభాయానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిప్రపత్తులతో స్వామిని దర్శించుకున్నారు. భజన బృందం ప్రత్యేక కీర్తనాలాపనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం చేశారు.

నేడు ‘స్పందన’

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమస్యలున్నవారు అధికారులకు అర్జీలు అందజేయాలన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

‘ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు’



కార్యక్రమంలో పాల్గొన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

రాప్తాడురూరల్: సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కారాదని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇండియన్ సైక్రియాట్రిక్ సొసైటీ అనంతపురం బ్రాంచ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) హాలులో కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అత్యున్నమైన జీవితాన్ని అర్ధంతరంగా ఆత్మహత్యతో ముగించుకోవడం పాపం అన్నారు. సైక్రియాట్రిస్ట్ డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో సమస్యలు సర్వసాధారణమన్నారు. జిల్లాలోని సుమారు 30 కళాశాలల్లో 3వేల మందికి పైగా యువతకు వారం రోజులుగా ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆచార్య కేఎల్ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ వింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ హేమలత, అనంత జిల్లా ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ మనోరంజన్ రెడ్డి, ఐఎంఏ మహిళా కార్యదర్శి డాక్టర్ సుమన గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

● పూర్వ విద్యార్థుల కలయిక

నార్పల: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎస్సీ బాలుర వసతి గృహ పూర్వ విద్యార్థులు ఆదివారం కలసి సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అప్పటి వార్డన్లు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. దాదాపు 35 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవదులు లేవు. వసతి గృహంలో గడిపిన రోజులను గుర్తు చేసుకున్నారు.

ప్రతాప్..స్థాయిని మించి మాట్లాడొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లు: టీడీపీ నాయకుడు, వాల్మీకి సాధికారత నాయకుడు ప్రతాప్‌నాయుడుకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని విమర్శించే స్థాయిలేదని మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎస్.రామలింగప్ప, జింకల రామాంజనేయులు, పట్టణ, మండల కన్వీనర్లు బి.సుంకప్ప, బి.మోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్, వాల్మీకి సాధికారత నాయకుడు ప్రతాప్‌నాయుడు ఎమ్మెల్యేను విమర్శించడాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. ప్రతాప్‌నాయుడు పార్టీలో చిచ్చుపెడుతున్నాడని ఉరవకొండ నుంచి తరిమితే ఇక్కడికొచ్చి దుప్పటి పంచాయతీలు చేసుకునే నువ్వా .. ఎమ్మెల్యేను విమర్శించేది అని అన్నారు. ఎమ్మెల్యేను విమర్శించే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక విక్రయిస్తున్నామే తప్పా.. ఒక్క ట్రాక్టర్‌కూడా అక్రమంగా అమ్ముకోలేదన్నారు. టీడీపీ హయాంలో మీరు ఇసుక అమ్ముకుని రూ.కోట్లు కూడబెట్టుకున్న విషయం అందరికీ తెలుసునన్నారు. మాజీ ఎమ్మెల్యే సోదరుడు శ్రీనాథ్‌గౌడ్ గుంతకల్లు మున్సిపాలిటీని గుప్పెట్లో పెట్టుకుని ఆయన కనుసన్నల్లోనే అన్ని పనులూ చేయడం అందరికీ తెలుసున్నారు.

ప్రశాంతంగా ఉండే గుంతకల్లులో చిచ్చుపెట్టొద్దు..

కక్షలు, ఫ్యాక్షనిజంలేని గుంతకల్లు నియోజకవర్గంలో చిచ్చుపెట్టడానికే ఇక్కడకు దాపురించావని ప్రతాప్‌నాయుడుపై వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఉరవకొండ నియోజకవర్గలోని పెంచులపాడులో గొడవలు సృష్టించడంతో అక్కడ టీడీపీ నాయకులు తరిమిన విషయాన్ని మరిచిపోయావా? అని ప్రశ్నించారు. గుత్తి బహిరంగ సభలో మా ఎమ్మెల్యే వైవీఆర్‌పైనా, ఆయన కుటుంబంపైన చంద్రబాబు నిరాధార ఆరోపణలు చేయడంతోనే ఎమ్మెల్యే స్పందించారన్నారు. ఇప్పటికైనా నా చౌకబారు విమర్శలు మాని పట్టణాభివృద్ధికి సహకరించాలన్నారు. ముఖ్యంగా గుంతకల్లు చరిత్రలో బీసీలకు పెద్దపీట వేసి, వారికి రాజకీయ పదవులు కట్టబెట్టిన ఘనత ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికే దక్కుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, మార్కెట్ యార్డు చైర్మన్ ఇలా అన్ని పదవులూ బీసీలకే ఇచ్చారన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్.భీమలింగప్ప, వార్డు ఇన్‌చార్జ్‌లు మార్కెట్ వెంకటేశ్వర్లు, మస్తాన్ సాయి పోగు వీరేష్, దర్గానాయుడు, గృహసారథుల మండల కన్వీనర్ ఎన్.గోవింద్‌నాయక్, విద్యార్థి విభాగం నాయకుడు వంశీయాదవ్, నాయకులు తిక్కస్వామి, బెస్త మనోహర్, షాబుద్దీన్, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురం జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 13, 14న స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అండర్–14, –17 బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు నీరజ, పీడీ శంకర్ తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, త్రో బాల్, టెన్నీ కాయిట్, బాల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న యోగా, వాలీబాల్, టెన్నీ కాయిట్, కబడ్డీ, కోకో, బాల్ బాడ్మింటన్, 14న అథ్లెటిక్స్, త్రోబాల్, షటిల్, బాడ్మిటన్, నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడా కారులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

గంగా భవానీదేవి గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని ఆలూరురోడ్డులోని చెరువుకట్ట సుంకులా పార్వతీదేవి గంగా భవానిదేవి గోశాలను ఆదివారం ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకుడు బెస్త శివశంకర్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఆధ్వర్యంలో గోశాలను ప్రారంభించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ, వైఎస్ చైర్మన్లు నైరుతిరెడ్డి, మైమున్, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



ఆలయ శిఖరానికి మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు



షిర్డీ సాయిబాబా మూలవిరాట్‌కు అభిషేకం చేస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో రజతోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. 108 మంది సుహాసినులు అందించిన 108 కలశాల ఆవు పాలు, మరో 108 కలశాల గంగాజలాలతో ఆలయంలోని మూలవిరాట్, ఆలయ శిఖరాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య అభిషేకించారు. ఉదయం యాగపూజ, ఆవాహిత దేవతా, విశేష ద్రవ్యహోమం, మహా పూర్ణాహుతి, యాత్రదాన సంకల్పం, యాత్రదానం నిర్వహించారు. తమిళనాడులోని వేలూరులోని శ్రీజలకంఠేశ్వరస్వామి ఆలయ అర్చకులు ఎస్.కందస్వామి శివాచార్య ఆధ్వర్యంలో పండితులు మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు మహాగణపతి, దత్తాత్రేయ, ఆంజనేయ, సాయిరామలింగేశ్వరస్వామి పరివార దేవతలకు, షిర్డీ సాయిబాబా మూల విరాట్‌కు మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దూప్ హారతి, సంధ్యా హారతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం 7 గంటలకు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరిగా పల్లకీ సేవతో ముగించారు.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్

యాడికి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏసీబీ కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తలారీ నాగేష్, రషీద్, శివయ్య, ఆదినారాయణ రెడ్డి, వెంకటనారాయణరెడ్డి , జిలాన్, హనుమంత రెడ్డి, ఉపేంద్రగౌడ్ తదితరులు రాయలచెరువు గ్రామంలో నగరూరు రహదారిలో టపాసులు పేల్చేందుకు సిద్ధమయ్యారు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ రంగయ్య, చరణ్ తదితరులు టపాసులు పేల్చకూడదనీ అడ్డుకున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో టీడీపీ నేతలను అక్కడ నుండి పంపించివేయడంతో గొడవ సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్‌నాయక్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఆత్మకూరు మండలం వేపచెర్ల తండాకు చెందిన వెంకటేష్‌నాయక్, సునీతమ్మ ద్విచక్రవాహనంపై అనంతపురం నుంచి వేపచెర్ల తండాకు వెళ్తుండగా వడ్డుపల్లి వద్ద ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో వెంకటేష్ నాయక్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ వాహనంలో అతన్ని చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గం – అనంతపురం హైవేలో రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే 1033 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని, హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

ఎదురెదురుగా టిప్పర్ల ఢీ.. డ్రైవర్ మృతి



మృతి చెందిన టిప్పర్ డ్రైవర్ రవి

తాడిపత్రి: ఎదురెదురుగా టిప్పర్లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బొందలదిన్నె వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వైఎస్సార్ జిల్లా, కొండాపురం మండలంలో ఉన్న ఇసుక రీచ్ నుంచి ఇసుకతో తాడిపత్రి వైపు వస్తున్న టిప్పర్, తాడిపత్రి నుంచి ఇసుక రీచ్‌కు వెళుతున్న ఖాళీ టిప్పర్ బొందలదిన్నె వద్ద తాడిపత్రి – కడప ప్రధాన రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో అనంతపురం ఎస్ఆర్ నగర్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ రవి (40) తీవ్రంగా గాయపడ్డాడు. తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిసింది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి మార్చురీకి తరలించారు.